సాక్షి
నిజామాబాద్
శనివారం । 22 । జూలై । 2023



సాధన చేసి సాధించారు..
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పరీక్షలు రాసి స్కాలర్ షిప్‌లకు ఎంపికవుతున్నారు.
- 8లో ▸



కారుణ్య నియామకాలకు ఓకే..
కారుణ్య నియామకాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో 117 పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
25.4 /23.0

వాతావరణం
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందే..
● మున్సిపల్ కమిషనర్ మకరందు



నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కమిషనర్ మంద మకరందు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జోన్–2 పరిధిలో ఉదయం 5 గంటలకే కార్యాలయానికి వెళ్లి ఉద్యోగుల హాజరుశాతాన్ని పరిశీలించారు. కార్మికులతో మాట్లాడారు. జోన్ పరిధిలో పలు కాలనీల్లో తిరుగుతూ శానిటేషన్‌ను పరిశీలించారు.ఆయా సెక్షన్లకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీ, జోన్ – 2 ఆఫీసర్, ఎస్సై నటరాజ్‌గౌడ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 38,700 క్యూసెక్కులు..



నిజాంసాగర్: హల్దీవాగు, ఘనపురం ఆనకట్టలతోపాటు పోచారం ప్రాజెక్టు ద్వారా శుక్రవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 38,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. మంజీర నదిలో వరద ఉధృతి అ ధికంగా ఉండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,395.90 అడుగుల(7.520 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



డిచ్‌పల్లి : అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో తమ విధులను నిర్వహించాలని ఏడో బెటాలియన్ (డిచ్‌పల్లి) కమాండెంట్ బి రాంప్రకాష్ సూచించారు. నూతనంగా బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం ఆయన లెక్చర్‌హాల్‌లో అధికారులు, సిబ్బందితో దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ.. సిబ్బందికి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్ విష్ణుమూర్తి, సీ ఆంజనేయరెడ్డి, కె భాస్కర్‌రావు, ఆర్‌ఐలు ఎంరాజు, పి వెంకటేశ్వర్లు, ఆర్ సర్దార్‌నాయక్, బి అనిల్‌కుమార్, ఎల్ మహేశ్, ఎం నరేష్, కె శ్యాంరావు, ఆర్ ప్రహ్లాద్, సురేష్, వసంత్‌రావు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల తనిఖీ



భీమ్‌గల్ : పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా మండలంలోని గోన్‌గొప్పుల, కుప్కల్, లింగాపూర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా చిత్రామిశ్రా గ్రామ పంచాయతీ రికార్డులను, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాలు, పల్లె ప్రగతి పనులను తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధుల, పంచాయతీ కార్యదర్శుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో గంగామోహన్, ప్రజా ప్రతినిధుల పాల్గొన్నారు.

ఐటీ జాబ్..యువత క్రేజ్

- నిజామాబాద్ ఐటీ హబ్‌లో కొలువుల కోసం జాతర
- సందడి చేసిన పలు కంపెనీలు
- ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ రంగం విస్తరణకు విస్తృత చర్యలు : ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా
- స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో చిన్న నగరాల్లో ఐటీ హబ్‌లు
- మొదటి జాబ్ మేళాలోనే 10 వేల రిజిస్ట్రేషన్లు



నగరంలో నిర్వహించిన టాస్క్ మెగా జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : యువతలో ఐటీ ఉద్యోగం పట్ల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో 'టాస్క్' సంస్థ సహకారంతో భూమారెడ్డి కన్వెన్షన్‌లో ఐటీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించే లక్ష్యంతో ఐటీ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీ ఉద్యోగాలంటే బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే కాకుండా జిల్లాల్లోనూ ఉండేలా చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు సైతం ఐటీ ఉద్యోగాలు అందుబాటులో ఉండేలా వేగంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. నిజామాబాద్ ఐటీ హబ్‌కు విదేశీ కంపెనీలు వచ్చేలా కృషి చేసిన మహేశ్ బిగాలకు అభినందనలు తెలిపారు. ఐటీ హబ్ అంటే కేవలం ఉద్యోగాలు కల్పించడమే కాదు, ఉద్యోగాలు సృష్టించేందుకు మరిన్ని బాటలు వేసినట్లన్నారు.

కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, టీఎస్‌డబ్ల్యూడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ నిజామాబాద్‌లో సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ఐటీ హబ్ కేంద్రబిందువవుతుందన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో తెలంగాణ ఐటీ రంగానికి హబ్‌గా మారిందన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ హబ్‌లను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం నెరవేరిందన్నారు. నగరంలో అత్యాధునిక పరిజ్ఞానంతో, విశాలమైన మూడంతస్తుల భవనంలో, ఆహ్లాదకర వాతావరణంలో ఐటీ హబ్‌ని నిర్మించడం జరిగిందన్నారు. త్వరలో మంత్రి కేటీఆర్ నిజామాబాద్ ఐటీ హబ్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈ ఐటీ హబ్‌లో ఉద్యోగాల భర్తీ కోసం 'టాస్క్' సహకారంతో జాబ్ మేళాని ఏర్పాటు చేశామన్నారు. జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల సందడితో స్టార్టప్ ఫెస్టివల్ తలపిస్తోందన్నారు. ఐటీ హబ్‌లో ప్రముఖ కంపెనీలు నైపుణ్యం కలిగిన విద్యార్థులను పారదర్శకంగా ఎంపిక చేస్తాయన్నారు. యువత ఆలోచనలకు పదును పెడితే సరికొత్త ఆవిష్కరణలు చేయగలుగుతారన్నారు. జాబ్ మేళా నిరంతర ప్రక్రియ అన్నారు.

- నగరంలో 50 వేల చదరపు అడుగులు, రూ. 40 కోట్ల పెట్టుబడితో ఈ హబ్‌ను ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 745 సీట్లు కల్పించారు. మరో 1000 మందికి ఇతర రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. త్వరలో రెండో దశ ఐటీ హబ్ ప్రారంభిస్తామని, ఇండస్ట్రియల్ పార్క్, ఆటో పార్క్ అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గణేశ్ గుప్తా పేర్కొన్నా రు. మొదటి జాబ్‌మేళాలోనే 10 వేల రిజిస్ట్రేషన్లు రావడం గొప్పవిషయమన్నారు.



అభ్యర్థినితో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి



మెగా జాబ్‌మేళాలో పేర్లు నమోదు చేసుకునేందుకు హాజరైన అభ్యర్థులు



అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు

జాబ్‌మేళాతో మనోధైర్యం వచ్చింది..



నేను హైద్రాబాద్‌లోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఎంఎస్సీ చదువుతున్నాను. జిల్లాలో మొదటిసారి పెద్ద ఎత్తున జాబ్‌మేళా నిర్వహించడంతో వచ్చాను. ఉద్యోగం వస్తుందో రాదో తెలియదు. అయితే నాలో మనోధైర్యం వచ్చింది. భవిష్యత్తులో జాబ్‌మేళాల్లోనూ పాల్గొంటాను. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం పెరిగింది. – అనీష, పీజీ విద్యార్థిని

అన్నింటికీ సమాధానాలు చెప్పాను..



15 కంపెనీలు వచ్చాయి. మూడు దశల్లో ఇంటర్వ్యూలు చేశారు. కంపెనీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాను. జాబ్‌మేళాలో నాతో పాటు వేలాది మంది పోటీ పడ్డారు. ప్రతిభ చూపిన వారికే ఉద్యోగం వస్తుంది. అందుకే నా వంతు ప్రయత్నం చేశాను. – రష్మిత, బీటెక్ విద్యార్థిని

అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది..



మొట్టమొదటి సారి జాబ్‌మేళాలో పాల్గొన్నాను. పెద్ద ఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు. ఈ అనుభవం నాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. స్కిల్స్ డెవలప్ చేసుకుంటేనే ఉద్యోగం వస్తుందని అర్థం అయింది. ప్రత్యేకంగా స్కిల్స్ డెవలప్ చేసుకుని మళ్లీ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధిస్తాను. – సాయికుమార్, డిగ్రీ విద్యార్థి

స్కిల్స్, ప్రతిభతో ఉద్యోగం సాధ్యం..



జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించాలంటే కచ్చితంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రతిభతో ఉంటేనే సాధ్యమవుతుంది. జిల్లాలో నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారు. మొక్కుబడిగా జాబ్ మేళాకు వస్తే ఉద్యోగం రాదు. సాధన చేయాల్సిందే. అప్పుడే ఉద్యోగం లభిస్తుంది. – నరేష్, పీజీ విద్యార్థి

వచ్చే నెలలో 'డబుల్' ఇళ్ల పంపిణీ
● మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆగస్టులో అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ఇళ్లపై అధికారులతో సమీక్షించారు. అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, కరెంటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. అర్హులకే ఇళ్లు ఇచ్చేలా ఎంపిక జరగాలన్నారు. ఆర్మూర్ ఆర్డీవో వినోద్, తహసీల్దార్లు, ఆర్‌అండ్‌బీ ఏఈ నర్సయ్య, మంత్రి ఓఎస్‌డీ విజేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కోటపాటి నర్సింహానాయుడు, బద్దం ప్రవీణ్ రెడ్డి, రాజాగౌడ్ ఉన్నారు.

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం
● డీఎంహెచ్‌వో సుదర్శనం



నిజామాబాద్ సిటీ : జిల్లాలో ఎవరైనా ఆర్‌ఎంపీలు స్కానింగ్ సెంటర్లతో కుమ్మక్కై భ్రూణహత్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సుదర్శనం హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ జిల్లాస్థాయి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ఎక్కువగా అవగాహన సదస్సులు నిర్వహించాలని, గర్భిణులుగా నమోదైనప్పటి నుంచి ఆశలు, ఏఎన్‌ఎంలు ప్రత్యేకంగా ఫాలోఅప్ చేయాలన్నారు. భ్రూణహత్యలకు పాల్పడిన వైద్యులపై, స్కానింగ్ సెంటర్లపై పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994, 1996 ప్రకారం కఠిన చర్యలు తీసుకుని స్కానింగ్ సెంటర్లు మూసివేయిస్తామన్నారు. కమిటీ సభ్యులు సూచించిన వివిధ సూచనలు వచ్చేసమావేశంలోగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, రేడియాలజిస్టు మధుసూదన్, గైనకాలజిస్టు రోహిణి, పీడియాట్రిషన్ నవీన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, డెమో గంగాధర్, ఆరోగ్య చైతన్య వేదిక కన్వీనర్, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, మహిళా సంఘం ఎన్జీవో పద్మాసింగ్, మెప్మా మాధురి, హెచ్‌ఈ రమా, డీఈవో దేవేందర్ పాల్గొన్నారు.

పొంగిన అలుగులు.. కూలిన ఇళ్లు



న్యాల్‌కల్‌లో కూలిన ఇల్లు



అలుగు పారుతున్న మాక్లూర్‌లోని చిక్లీ చెరువు

- ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు..
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- 18 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు
- రాగల రెండు రోజులు వర్షసూచన

సుభాష్‌నగర్ : జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు 120 పైగా చెరువులు అలుగులు పారుతున్నాయి. పలు గ్రామాల్లో నివాసపు ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. నగరంతో పాటు ఆర్మూర్, బోధన్, తదితర మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా గడిచిన 24 గంటల్లో 28.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఆరు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాల వల్ల 18 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. రాగల రెండ్రోజులు జిల్లాకు వర్షసూచన ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

త్రివేణి సంగమం వద్ద..
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు మంజీర, హరిద్ర నదుల నుంచి నీటి రాకతో రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా సాలూర వద్ద పాత వంతెన మీదుగా మంజీర నది పోటెత్తడంతో తెలంగాణ – మహారాష్ట్ర మధ్య రవాణా నిలిచిపోయింది. పాత వంతన వద్ద రోడ్డుకు మట్టి అడ్డంగా వేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

- సిరికొండలోని కప్పల వాగు, ఇందల్వాయి, సిర్నాపల్లి, ఎల్లారెడ్డిపల్లి, నల్లవెల్లి,మల్లాపూర్, బర్ధిపూర్, కాల్పోల్ చెరువులు అలుగులు పారుతున్నా యి. బోధన్‌లో పసుపు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

వర్షపాతం వివరాలు..

మండలాలు	వర్షపాతం (మి.మీ)		
		బోధన్	74.8
		సిరికొండ	27.4
నవీపేట	74.0	చందూరు	48.8
వర్ని	54.0	ఎడపల్లి	60.6
డిచ్‌పల్లి	34.2	నిజామాబాద్‌రూరల్	27.8
రెంజల్	75.6	సాలూర	73.0
కోటగిరి	66.6	రుద్రూరు	60.0
మాక్లూర్	36.6	మోపాల్	31.0

- నిజామాబాద్ అర్బన్‌లో పులాంగ్ వాగుకు వరద నీరు వచ్చి చేరుతోంది. మాలపల్లి, అర్సపల్లి, బోధన్‌రోడ్‌తోపాటు రోటరీనగర్, అయోధ్యనగర్, నాగారంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్మూర్, బాల్కొండల్లోని పెద్దవాగు, ఇతర వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఎడపల్లిలోని అంబం నీటికుంట నిండిపోయి బ్యాక్‌వాటర్‌తో 70 ఎకరాలు, సాలూరలోని మంజీర నది తీరంలో మందర్న శివారులో 100 ఎకరాల నీట మునిగాయి.

రుద్రూర్ : పోతంగల్ మండలం పాత పోతంగల్, కొడిచర్ల, హంగర్గా, కల్లూర్, సుంకిని గ్రామ శివారులో మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఎడపల్లిలో చెరువు నిండిపోగా పొలాల్లోకి చేరిన వర్షం నీరు

తెగిన రోడ్లు..

- వర్షాలకు జిల్లాలో 46 వరకు ఇండ్లు కూలిపోయాయి. పాక్షికంగా కూలిపోవడంతో రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. 7 చోట్ల ప్రహరీలు పడిపోయాయి.
- చందూర్ మండల కేంద్రంలో ఓ కిరాణ దుకాణంపై చెట్టు కూలి, రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.
- జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ నుంచి కలిగోట్ వెళ్లే దారిలో రొడ్డం వాగుపై రోడ్డు కొట్టుకుపోయింది. పడకల్ గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాధవనగర్ రైల్వేగేట్ వద్ద రెండు రోజుల క్రితం నిజాంసాగర్ సబ్ కెనాల్ ద్వారా వచ్చే నీటి ప్రవాహంతో రోడ్డు తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేసి రాకపోకలను ప్రారంభించారు. కోటగిరి మండలం కొల్లూరు, దొంకేశ్వర్ మండలంలో అధిక వర్షాలకు రోడ్లు తెగిపోయాయి.



మనోహరాబాద్ శివారులో కొట్టుకుపోయిన రోడ్డు



అంతర్రాష్ట్ర వంతెన వద్ద గోదావరి పరవళ్లు

గోదావరికి భారీ వరద
● నీట మునిగిన శివాలయం

రెంజల్(బోధన్) : ఎగువన మహారాష్ట్రతో పాటు జిల్లాలో నాలుగు రోజులుగా ఎడవెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పుష్కరక్షేత్రం వద్ద నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది.

మంజీర, హరిద్ర నదుల నుంచి వరద నీరు వచ్చి కందకుర్తి వద్ద గోదావరిలో కలవడంతో మహారాష్ట్ర–తెలంగాణ రాష్ట్రాల మధ్య గోదావరి నదిపై నిర్మించిన వంతెనకు ఆనుకుని వరద నీరు ప్రవహిస్తుంది.

క్లుప్తంగా

24, 25, 26 తేదీల్లో కేజీబీవీ అర్హత పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: కేజీబీవీల్లో వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలు జిల్లా కేంద్రంలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో నగరంలోని అర్సపల్లి నాలెడ్జ్ పార్క్ స్కూల్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు పొందిన వంజరి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హులు సుభాష్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఈనెల 31లోపు తమ మార్కుల మెమో, బయోడేటాను అందజేయాలన్నారు. వివరాలకు 9848490055, 9849391493 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దాశరథి జయంతి వేడుకలు వాయిదా

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా జైలులో శనివారం జరగాల్సిన దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు వాయిదా పడ్డాయి. జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వేడుకలను వాయిదా వేసినట్లు ఎమ్మెల్సీ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి వేడుకల సందర్భంగా దశారథిని బంధించిన ఖిల్లా జైలును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దె పనులు జరుగుతున్నాయి. జూలై 22 వేడుకలను వైభవంగా నిర్వహించేలా రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఈ నెల 13న నిజామాబాద్‌కు వచ్చి ఖిల్లా జైలు ఆవరణను పరిశీలించారు. కానీ వర్షాలతో ఈ వేడుకలను వాయిదా వేశారు.

అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్



ఆర్మూర్‌టౌన్: అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రమేశ్‌ను వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ మాట్లాడుతూ.. డాక్టర్ రమేశ్ పేదలకు వైద్యం అందించడంలో ముందుంటూనే కరోనా సమయంలో విశేష సేవలందించారని కొనియాడారు. డాక్టర్ రుద్ర శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి సాయి, కృష్ణమూర్తి, ఆండ్రోస్, సంపత్, నరేందర్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

నేడు భీమ్‌గల్ ఆర్టీసీ డిపోను పరిశీలించనున్న మంత్రి

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ పట్టణంలోని ఆర్టీసీ డిపోను రోడ్లు భవనాలశాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ శనివారం పరిశీలించనున్నారు. ఈ డిపోను కొన్నేళ్ల క్రితం మూసివేశారు. దీనిని పునరుద్ధరించి ఇక్కడి ప్రజలకు ప్రజా రవాణాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇక్కడ ఉన్న బస్సు డిపోకు కావాల్సిన వనరులు, రూట్లు, డిపోలో ఉన్న సామగ్రి తదితర వివరాలను ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ సేకరించనున్నట్లు తెలిసింది.

సాధన చేశారు.. సాధించారు

- ఉమ్మడి జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్‌కు 205 మంది విద్యార్థుల ఎంపిక
- ఇంటర్ వరకు అందనున్న స్కాలర్‌షిప్



ఈ చిత్రంలో కనిపిస్తున్న వేల్పూర్ మండలం మోతె ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాని(ఎన్‌ఎంఎంఎస్)కి ఎంపికయ్యారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు చొరవ చూపి విద్యార్థులతో దరఖాస్తులు చేయించి పరీక్షలో విజయం సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో ప్రతిసారి ఈ పాఠశాల నుంచి విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక అవుతున్నారు.

నిజామాబాద్‌అర్బన్: సర్కార్ బడుల్లో చదువుతున్న విద్యార్థుల ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అందిపుచ్చుకుంటున్నారు. ఇటీవల ప్రకటించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతనాల(ఎన్‌ఎంఎంఎస్) ఫలితాలే అందుకు నిదర్శనం. ఈ స్కాలర్‌షిప్‌కు ఉమ్మడి జిల్లాలో 205 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సాహించాలని కేంద్ర ప్రభుత్వం మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తుంది. ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పరీక్ష పెట్టి ఎంపికైన ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ వరకు ఉపకారం వేతనం అందజేస్తోంది. ఈ ఏడాది నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తాచాటి 205 మంది ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా నుంచి 130 మంది, కామారెడ్డి జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

చొరవ చూపితే మరింత ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల చేత దరఖాస్తు చేయించాడనికే పరిమితం కాకుండా విద్యార్థులు పరీక్షలో విజయం సాధించే విధంగా శిక్షణనిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాల విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. కానీ చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు దీనిపై చొరవ చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నా.. ఉపాధ్యాయుల అలసత్వంతో ఉమ్మడి జిల్లాలో అనేకమంది విద్యార్థులు ఉపకార వేతనానికి దూరమవుతున్నారు. ఆయా ప్రభుత్వ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులతో దరఖాస్తులు చేయించి పరీక్ష రాయించాల్సి ఉన్నా.. కొందరు మాత్రమే చొరవ తీసుకొని దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఉపాధ్యాయులు చొరవ చూపి విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేస్తే మరింత మందికి ప్రయోజనం కలుగుతుంది.

శిక్షణనిస్తే మంచి ఫలితాలు



జాతీయ ఉపకార వేతనానికి జిల్లాలో చాలా మంది విద్యార్థులు ఎంపిక అవడం శుభపరిణామం. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా మా పాఠశాల నుంచి ఈ ఏడాది నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి శిక్షణనిస్తే ఎక్కువ మంది ఎంపికయ్యే అవకాశం ఉంది.

– లింగన్న, హెచ్‌ఎం, మోతె ఉన్నత పాఠశాల

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అందేలా టీచర్లు ప్రోత్సహించాలి. దీంతో విద్యార్థులు లబ్ధి పొందుతారు. అన్ని పాఠశాలల్లో టీచర్లు ఈ విధంగా కృషి చేయాలి.

– దుర్గాప్రసాద్, డీఈవో

ముడుపుల పేరుతో రూ.70 లక్షలు స్వాహా!

- స్కీంల స్కాంలో కొత్త ట్విస్టు
- లక్కీ డ్రా నిర్వహణకు ఆటంకాలు ఉండకుండా..
- పోలీసులు, ఇతరులకు ముడుపులు ఇచ్చినట్లు లెక్కలు
- బహుమతుల ఎగవేతకు ఇద్దరు నాయకుల పన్నాగం

మోర్తాడ్: స్కీంల నిర్వహణకు ఎలాంటి ఆటంకం ఉండకుండా ఉండటానికి పోలీసులు, ఇతరులకు భారీగా ముడుపులు ఇచ్చామని లెక్కలు చూపుతు బహుమతుల ఎగవేతకు పక్కా వ్యూహం పన్నిన నాయకుల తీరు వివాదాస్పదం అవుతోంది. మోర్తాడ్ మండలం దొన్కల్ కేంద్రంగా సాగిన స్కీంకు సంబంధించి సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం, సొమ్ము వాపసు చేయకపోవడంతో నిర్వాహకులైన బీఆర్‌ఎస్ నాయకులపై మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. స్కీంల సొమ్ము వాపసు చేయడం, బహుమతులను అందించడానికి పక్షం రోజులు గడువు విధించిన విషయం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్కీంల లెక్కలు చూసుకుంటున్న భాగస్వాములకు ఇద్దరు నాయకులు ట్విస్టు ఇవ్వడం చర్చనీయాంశమైంది. స్కీం నిర్వహణ కోసం పోలీసులు, ఇతరులకు రూ.70లక్షల వరకు ముడుపులు ఇచ్చామని ఇదంతా లెక్కల్లో ఖర్చు రాసి తమ సొమ్ము తమకు ఇవ్వాలని ఒక మండల స్థాయి ప్రజాప్రతినిధితో పాటు మరో దొన్కల్ నాయకుడు తమ పార్టనర్ల ముందు ఉంచారని తెలిసింది. స్కీం సొమ్మును ఇప్పటికే పక్కదారి పట్టించడమే కాకుండా ముడుపుల సొమ్ము లెక్కలను భారీగా చూపడంతో స్కీం భాగస్వాములైన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. స్కీం నిర్వహణతో వసూలై మొత్తంలో సగం సొమ్మును ముడుపుల కింద చూపితే సభ్యులకు బహుమతులు ఎలా పంపిణీయాలనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. పోలీసు శాఖలోని వివిధ హోదాల్లో ఉన్న అధికారులకు ముడుపులు ఇచ్చామని అందువల్ల ఈ స్కీంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ముడుపుల లెక్క చూపుతున్న నాయకులు చెప్పినట్లు తెలుస్తోంది. ఒక వేళ ముడుపులు ఇచ్చి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో ఇవ్వడం సాధ్యమేనా అనే సందేహం వ్యక్తమైతుంది. ఇప్పటికే ముడుపుల సొమ్మును మినహాయించి బహుమతుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తుంది. ముడుపుల మొత్తం భారీ స్థాయిలో ఉండటంతో సభ్యులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇది ఇలా ఉండగా తమకు మామూళ్లు ఇచ్చినట్లు నాయకులు తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని వారు సొమ్మును సొంతానికి వాడుకుని మాపై నిందలు వేస్తున్నారని కొందరు పోలీసు అధికారులు చెబుతున్నారు. స్కీం నిర్వాహకులు అందరు బీఆర్‌ఎస్‌కు చెందిన వారే కావడంతో పోలీసులు ముడుపులు తీసుకోవడం ఉత్తుత్తి ప్రచారమే అని పలువురు కొట్టిపారేస్తున్నారు.

కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో 117 పోస్టుల భర్తీ



జెడ్పీ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం: ఎట్టకేలకు కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం ఈ నెల 20న రాత్రి జీవో నం.79 విడుదల చేసింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ పరిధిలో 117 పోస్టులను కారుణ్య నియమకాల ద్వారా భర్తీ చేయనున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూపులు

జిల్లా పరిషత్ పరిధిలో 2018 జూలై నుంచి కారుణ్య నియమకాలు భర్తీ లేదు. దీంతో 5 ఏళ్లుగా అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు పెట్టి కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ పరిధిలో 117 పోస్టులు ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు గతంలో పంపించారు. మరో వైపు కలెక్టరేట్ పరిధిలో కూడా 60వరకు కారుణ్య నియమకాలకు సంబంధించి పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారోనని దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తులు పెట్టి ఏళ్లు గడుస్తుంది. వీరిని కూడా ఇక్కడే జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేస్తారని అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాలు రాగానే..

జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించి పోస్టులను భర్తీ చేస్తాం. దీని కోసం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మార్గదర్శకాలు రాగానే భర్తీ ప్రక్రియ చేపడతాం. – శివకుమార్, జిల్లా పరిషత్ జనరల్ సూపరింటెండెంట్

వర్షానికి కూలిన ఇళ్లు



జానకంపేటలో కూలిన ఇల్లు



మల్కాపూర్(ఎం)లో ..



చందూర్‌లో దుకాణంపై కూలిన చెట్టు

డొంకేశ్వర్(ఆర్మూర్): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలుతున్నాయి. గురువారం చిన్నయానంలో పెంకుటిల్లు కూలగా, శుక్రవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో వన్నెల లసుంబాయికి చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఆర్‌ఐ రాజేశ్వర్ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

వర్ని: వర్ని మండలంలోని జాకోర, జలాల్పూర్, పాత వర్ని, హుమ్నాపూర్ , తగిలి గ్రామాల్లో వర్షానికి పలు ఇళ్లు కూలిపోయాయి. పరిస్థితులను గమనించిన కుటుంబ సభ్యులు ఇండ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు.

విరిగిన చెట్టు

వర్ని(చందూర్): చందూర్‌లో వర్షానికి ఒక చెట్టు విరిగి దుకాణం పై పడడంతో దుకాణం పూర్తిగా ధ్వంసం అయింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వెల్లడించారు.

ఎడపల్లి: మండలంలోని జానకంపేటలో శుక్రవారం తెల్లవారుజామున శాల నర్సయ్య ఇల్లు కూలిపోయింది. పురాతన ఇల్లు కావడంతో వర్షానికి తడిసి నేల కులింది. బాధితుడు మాట్లాడుతూ సుమారు 40వేల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మోపాల్: వర్షం ధాటికి శుక్రవారం మండలంలోని సిర్‌పూర్‌లో 6, న్యాల్‌కల్‌లో 2 ఇండ్లు కూలిపోయాయి. సర్పంచులు ముత్యంరెడ్డి, గంగాప్రసాద్, ఆర్‌ఐ రాజేశ్వర్ పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితులకు తక్షణసాయంగా ప్రభుత్వం రూ.3వేలను అందజేస్తుందని తహసీల్దార్ లత పేర్కొన్నారు.

నిజామాబాద్ సిటీ: వర్షాలకు నిజామాబాద్ రూరల్ మండలంలో నాలుగు ఇళ్లు దెబ్బతిన్నట్లు ఆర్‌ఐ హరీశ్‌రెడ్డి తెలిపారు. మల్లారంలో డిచ్‌పల్లి భూదమ్మ, ఛత్రధర్‌నగర్ తండా(గొల్లగుట్ట)లో కేతావత్ కౌసల్య, బాదవత్ వనిత ఇళ్లు, మల్కాపూర్(ఎం) రావుట్ల సాయమ్మ ఇండ్లు దెబ్బతిన్నాయని ఆర్‌ఐ తెలిపారు.

బోధన్: బోధన్ రాకాసీపేట్‌లో శేఖర్ అనే వ్యక్తి పెంకుటిల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలిపోవడంతో ప్రమాదం తప్పింది.

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి, కోటగిరి, రుద్రూర్‌లో ఒక్కో ఇల్లు వర్షానికి దెబ్బతిన్నాయి. అంబంలో రెండు, కొండాపూర్‌లో రెండు, దొమలేడ్గిలో ఒకటి కొత్తపల్లిలో మూడు ఇళ్లు కూలాయి.



డొంకేశ్వర్‌లో ..

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకం

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకమైందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ, పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాసనసభా నియోజకవర్గాల వారీగా సంచార రథాల (మొబైల్ వాహనాల) ద్వారా గ్రామగ్రామాన ప్రచారం చేయిస్తున్నామన్నారు. సంచార వాహనాల ఇన్‌చార్జీల వద్ద కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచామని, 2023 అక్టోబర్ 01 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారంతా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈవీఎంల పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఈవీఎం డెమోన్ స్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురికి ఎస్సైల నుంచి సీఐలుగా పదోన్నతులు లభించాయి. నగరంలోని 5వ టౌన్ ఠాణా ఎస్సై సాయినాథ్, 6వ టౌన్ నుంచి నిర్మల్‌కు బదిలీ అయిన ఎస్సై సాయికుమార్‌గౌడ్‌, అలాగే ముత్యంరాజుకు సీఐలుగా పదోన్నతులు లభించాయి. కామారెడ్డి జిల్లా నుంచి ఎస్సై పబ్బప్రసాద్, శ్రీధర్‌రెడ్డికి సైతం సీఐలుగా పదోన్నతులు వచ్చాయి.

హాస్టళ్ల సర్వే ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్, గురుకుల, కస్తూర్బా, ప్రభుత్వ బడుల్లో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి రఘురాం శుక్రవారం తెలిపారు. ఈ సర్వేలో వచ్చినటువంటి సమస్యలపై ఆగస్టు 7న విద్యార్థులతో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



స్పీకర్ పోచారం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, మరో వారం రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణాలు, పర్యటనలు పెట్టుకోకుండా ఇంట్లోనే ఉండాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. పాత ఇళ్లు, మట్టి గోడలు ఉన్న వారు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అసలు అలాంటి ఇళ్లలో ఉండవద్దన్నారు. అదేవిధంగా పిల్లలు బయటకు రాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. కాలువలు, వాగులు, చెరువుల సమీపానికి ఎవ్వరూ వెళ్లవద్దన్నారు. విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దన్నారు. ముఖ్యంగా వ్యవసాయదారులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రకృతిని ఎదిరించలేమని, జాగ్రత్తగా ఉండాలన్నారు.

యువ క్రికెటర్‌కు బాసటగా ఎమ్మెల్సీ



అరవింద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవీపేట : మండలంలోని లింగాపూర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన యువ క్రికెటర్ ఈర్నాల అరవింద్‌కు అండగా ఉంటానని ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీసులో ఆమెను కలిసి, కుటుంబ పరిస్థితిని వివరించారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రికెటర్ ఈర్నాల అరవింద్‌ను సొంత డబ్బుతో ఉన్నతమైన అకాడమీలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, లింగాపూర్ సర్పంచ్ బత్తూర్ సాయిలు తదితరులు ఉన్నారు.

మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి



అవార్డులు అందజేసిన జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, డీఐఈవో రఘురాజ్ తదితరులు

నిజామాబాద్ అర్బన్ : విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో న్యూ అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి న విద్యార్థులకు 2022–23 అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అతిథులు డీఐఈవో రఘురాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా ప్రతిమారాజ్, డా రాంమోహన్ రెడ్డి, డాక్టర్ బిలోజి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల సాధారణ కూడా విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్,, ఇందూరు యువత అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, టీవీయూవీ జిల్లా కన్వీనర్ అజయ్, నవీన్, సుభాష్, సందీప్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

ఖలీల్‌వాడి: హత్యాయత్నం కేసులో సయ్యద్ ఇక్రముద్దీన్‌కు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీకాంత్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాలు.. నిజామాబాద్ నగరంలోని హస్మీ కాలనీకి చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్ మద్యం తాగడానికి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న టానిక్ వైన్‌షాపు పర్మిట్ రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ మద్యం తాగుతున్న బాలాజీ సంగ్రామ్, షేక్ ఆమేర్‌ను మద్యం పోయమని అడిగాడు. వారు నీకెందుకు పోయాలనడంతో తన జేబులోంచి బ్లేడ్ తీసి ఆమేర్ గొంతుపై కోశాడు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇక్రముద్దీన్‌కు నాలుగేళ్ల కఠిన జైలుశిక్ష తోపాటు రూ.1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి శ్రీకాంత్‌బాబు తీర్పులో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 12 మేకల మృతి



వర్ని: మండలంలోని పొట్టిగుట్ట తండాలో మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 మేకలు చనిపోయాయి. గ్రామానికి చెందిన కాట్రోత్ వసంత్ తన మేకలను షెడ్డులో ఉంచగా శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేసి 12 మేకలను చంపాయి. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.లక్ష 75 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కామారెడ్డి క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన దేవునిపల్లిలో శుక్రవారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దేవల నారాయణ పాల వ్యాపారం చేస్తున్నాడు. రోజూ మాదిరిగా పాలు పోసి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కామారెడ్డి నుంచి పిట్లం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో నారాయణ కాలు నుజ్జునుజ్జయింది. వెంటనే అతడిని ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించారు.

కారు బోల్తా



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై నుంచి కిందకు దిగుతుండగా కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు యువకులు ఆల్టో కారులో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చారు. ప్రాజెక్టును చూసిన తర్వాత కిందకు దిగుతుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. క్షతగాత్రులను వెంటనే హైవే అంబులెన్స్‌లో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌లోని బాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద గల కూరగాయల మార్కెట్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.30,400, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని ఆర్మూర్ ఠాణాలో అప్పగించారు.

సాగు ఎలా ఉంది?

- రైతులతో మాట్లాడిన యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో సాగు తీరుతెన్నులపై అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు రైతుల నుంచి వివరాలు సేకరించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ముగ్గురు మహిళా ప్రతినిధులు వ్యవసాయ శాఖలో ఆదర్శ రైతులతో సమావేశమయ్యారు. ఏయే పంటలతో వ్యవసాయం చేస్తున్నారు..? సాగు లాభదాయకమా..? ఎకరానికి ఎంత లాభం వస్తుందని ఆరా తీశారు. జిల్లాలో గోదాములు, మార్కెటింగ్‌పై అధికారులతో మాట్లాడారు. పంటల విక్రయాల్లో ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారా అని ఆరా తీశారు. వ్యవసాయంపై ఎక్కువ మంది రైతులు ఆధారపడ్డారని, ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను అందజేస్తుందని డీఏవో వాజిద్ హుస్సేన్ వివరించారు. కాన్సులేట్ ప్రతినిధుల్లో క్యాథరిన్‌తో పాటు కవిత, వసుంధర తదితరులు ఉన్నారు.